క్లుప్తంగా

కరాటే బెల్ట్ టెస్ట్‌లో విద్యార్థి ప్రతిభ



ఎల్లో బెల్ట్‌తో వివేకానంద

రెబ్బెన: మండల కేంద్రంలోని పాఠశాలకు చెందిన విద్యార్థి వివేకానంద ఆదివారం కరాటే బెల్ట్ టెస్ట్‌లో ప్రతిభ కనబర్చి బెల్ట్‌తో పాటు ప్రశంసా పత్రం అందుకున్నట్లు కరాటే మాస్టర్ చాపిడి కుమార్ తెలిపారు. వివేకానంద గత మూడు నెలలుగా రెబ్బెన కరాటే క్లబ్ ఆధ్వర్యంలో సాధన చేసి బెల్ట్ టెస్ట్‌లో ఎల్లో బెల్ట్‌తో పాటు ప్రశంసా ప్రతాన్ని అందుకున్నట్లు తెలిపారు. విద్యార్థిని పాఠశాల సి బ్బందితో పాటు గ్రామస్తులు అభినందించారు.

'స్వచ్ఛదనం- పచ్చదనం' విజయవంతం చేయండి

కెరమెరి: నేటి నుంచి మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో ప్రారంభం కానున్న స్వచ్ఛదనం..పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో అంజద్‌పాషా, తహసీల్దార్ దత్తు ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికైన గ్రామ సభ కమిటీ సభ్యులు ప్రతి రోజు కార్యక్రమాల్లో తప్పకుండా హాజరు కావాలని, ప్రభుత్వం చేపట్టే కార్యక్రమంపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని కోరారు.

ఆసిఫాబాద్‌రూరల్: నేటి నుంచి ఆసిఫాబాద్ మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆసిఫాబాద్ మున్సిపాలిటీ కమిషనర్ భుజంగరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నేడు మున్సిపాలిటీ పరిధిలోని ఆర్ ఆర్ కాలనీలో ప్రారంభించనున్నట్లు ఈ నెల 9వ తేదీ వరకు అన్ని కాలనీలో కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పేర్కొన్నారు.

మర్కోళ్ల సందడి



కర్రలపై నడుస్తున్న ఆదివాసీలు

కెరమెరి: మండలంలోని గిరిజన గ్రామాల్లో మర్కోళ్ల సందడి షురూ అయ్యింది. జాము రావుస్ (శ్రావణమాసం ప్రారంభం) పండుగను పురస్కరించుకుని పొలాల అమావాస్య తర్వాత నిర్వహించే బడిగ పండుగ వరకు ఆయా గ్రామాల్లో యువకులు, పిల్లలు వెదురుతో తయారు చేసిన కర్రల ఆసరాతో నడుస్తుంటారు. ఇలా నడిస్తే ఇంటిల్లిపాది బాగుంటారని వారి నమ్మకం. అనాదిగా వస్తున్న ఆచారమని గ్రామ పెద్దలు చెబుతున్నారు. ఆదివారం చౌపన్‌గూడలో మర్కోళ్లు ఇలా సందడి చేస్తూ కనిపించారు.

ఏమాయికుంటలో వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఇంద్రవెల్లి: మండలంలోని ఏమాయికుంట గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన శ్రీకృష్ణ ఆస్పత్రి వైద్యులు క్రాంతి, దుర్వ గణేష్, కావ్య, రాహుల్ వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జాదవ్ లఖన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణతో మాదిగ ఉప కులాలకు న్యాయం'



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ఇచ్చోడ: ఎస్సీ వర్గీకరణతోనే మాదిగ ఉపకులాలకు న్యాయం జరుగుతుందని బుడగ జంగం మండల అధ్యక్షుడు పెంటన్న అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఆయన మాట్లాడుతూ.. 30 సంవత్సరాల సుదీర్ఘ పోరాటాల తర్వాత సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకులంగా తీర్పు వెలువరించడం మాదిగల విజయమన్నారు. బుడగ జంగం జిల్లా ప్రధాన కార్యదర్శి పేర్ల గంగయ్య, మండల ఉపాధ్యక్షుడు గడ్డం రవి, సిరిగిరి రాములు, హనుమంతు అశోక్ పాల్గొన్నారు.

ఎన్నాళ్లీ గోస..!

- కష్టాల్లో శివపెల్లి, దిందా గ్రామాల ప్రజలు
- వంతెన లేక ప్రమాదకరంగా వాగు దాటుతున్న వైనం
- పట్టించుకోని అధికారులు



దిందా గ్రామానికి వెళ్లే మార్గంలోని వాగు గుండా ట్రాక్టర్‌లో వెళ్తున్న మహిళలు



శివపెల్లి వాగును ప్రమాదకరంగా దాటుతున్న మహిళలు

చింతలమానెపల్లి: మండలంలోని శివపెల్లి, దిందా గ్రామాల ప్రజలు కనీస వసతులు లేక అష్టకష్టాలు పడుతున్నారు. మండలంలోని గూడెం గ్రామ పంచాయతీ అనుబంధగ్రామం శివపెల్లికి చేరుకోవడానికి గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. చింతల మానెపల్లి నుంచి గూడెం గ్రామానికి చేరుకునే ప్రధాన రహదారి నుంచి కేవలం 3 కిలోమీటర్ల దూరంలో గ్రామం ఉంది. గ్రామానికి చేరుకోవడానికి మట్టి రోడ్డు ఉండగా మార్గంలో రెండు వాగులు ఉన్నాయి. మట్టిరోడ్డు వర్షాకాలంలో పూర్తిగా బురదమయంగా మారుతుంది. మరోవైపు వానలకు వాగులు ఉధృతంగా ప్రవహించే క్రమంలో వంతెనలు లేక ప్రమాదకరంగా వాగు దాటి రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది.

రాకపోకలు బంద్..

మండలంలోని దిందా గ్రామం, గూడెం అంతర్రాష్ట్ర ప్రధాన రహదారి నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈమార్గంలో వాగుపై 30 ఏళ్ల క్రితం లోలెవల్ వంతెన నిర్మించారు. ప్రాణహిత నదికి సమీపంలో ఉండడంతో వర్షాకాలంలో వచ్చే వరద నీటితో రోజుల తరబడి వంతెన మునిగిపోతోంది. ఒక్కోసారి నెల రోజుల పాటు వంతెన మునిగి ఉంటుండడంతో రాకపోకలు సాగడం లేదు. వాగును దాటేటపుడు పలువురు ప్రమాదాలకు గురయ్యారు.

కనీస సౌకర్యాలు కరువు..

శివపెల్లి గ్రామంలోని ప్రజలు కనీస వసతులు లేక ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామంలో తాగునీటి కోసం మిషన్ భగీరథ పథకం ట్యాంక్ నిర్మించినా నీటి సరఫరా చేయడం లేదు. గ్రామంలో ఐటీడీఏ ద్వారా ఏర్పాటు చేసిన మంచినీటి సరఫరా ట్యాంక్ సైతం గత ఏడాదిగా పని చేయడం లేదు. పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకోగా పాఠశాల చుట్టూ మురికి నీరు నిలిచిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. తాగునీటి కోసం ఇక్కడి గ్రామస్తులు చేతిపంపుపైనే ఆధారపడుతున్నారు. గ్రామంలో నాణ్యత లేకుండా నిర్మించడంతో అంతర్గత రహదారులు నాసిరకంగా దర్శనమిస్తున్నాయి. శివపెల్లి గ్రామస్తులు ప్రభుత్వం అందించే రేషన్ తీసుకోవడానికి గూడెం గ్రామానికి నడిచి రావాల్సిన పరిస్థితి ఉంది. దిందా గ్రామంలో పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం ఉండగా వర్షాకాలంలో అక్కడ పని చేసే ఉద్యోగులకు తిప్పలు తప్పడం లేదు. వరద ఉధృతి తగ్గినపుడు గ్రామస్తుల సహకారంతో వాగును దాటి గ్రామానికి చేరుకుంటున్నారు. వాగు ఉధృతి ఎక్కువగా ఉంటే ఇక్కడ విధులు నిర్వహించడం ఉద్యోగులకు కత్తిమీద సాములా మారుతోంది. వాగుపై వంతెన నిర్మించాలని, వరద ఉన్న సమయాల్లో వాగుల వద్ద మరబోట్లు ఏర్పాటు చేయాలని కోరుతూ దిందా గ్రామ యువకులు గతంలో జిల్లా కలెక్టర్‌కు లేఖ రాశారు. లోలెవల్ వంతెన స్థానంలో హైలెవల్ వంతెన నిర్మించాలని పలుమార్లు దీక్షలు చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ముమ్మరంగా వరి నాట్లు



దహెగాంలో వరి నాట్లు వేస్తున్న కూలీలు

- వరికి అనుకూలంగా భారీ వర్షాలు
- కూలీలకు పెరిగిన డిమాండ్
- మండలంలో 10వేల ఎకరాల్లో వరి సాగు

దహెగాం: ఖరీఫ్ సీజన్ ఆరంభంలో వర్షాలు ఆశించిన స్థాయిలో కురువక పోవడంతో సాగు ఆలస్యం అయినప్పటికీ గత కొద్ది రోజుల నుంచి మండలంలో భారీ వర్షాలు కురువడంతో ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు నీటితో నిండిపోయాయి. కాగా గత నాలుగు రోజుల నుంచి మండలంలో వరి నాట్లు జోరందుకున్నాయి. రైతులంతా వరి నాట్లు ఒకేసారి వేస్తున్నందున కేజీవీల్స్ ట్రాక్టర్‌లకు, కూలీలకు డిమాండ్ ఏర్పడింది. ప్రస్తుతం మండలంలో వరినాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. రైతులు ఇంటిల్లిపాది పొలాల్లో బిజీగా కనిపిస్తున్నారు.

10వేల ఎకరాల్లో వరి సాగు..

మండల వ్యాప్తంగా ఈ సంవత్సరం ఖరీఫ్‌లో 10వేల ఎకరాల్లో వరి సాగవుతుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. గత సంవత్సరం కంటే ఈ ఏడాది వరి నాట్లు 20 రోజులు ఆలస్యమైనట్లు రైతులు పేర్కొంటున్నారు. మండల కేంద్రంతో పాటు లగ్గాం, పంబాపూర్, మత్రిపల్లి, కమ్మర్‌పల్లి, హత్తిని, ఒడ్డుగూడ, చినరాస్పెల్లి, గెర్రె, గిరవెల్లి, కర్జి గ్రామాల్లో అధికంగా వరి సాగు చేస్తున్నారు. వరి సాగు పనులు జోరకుందుకున్న నేపథ్యంలో కూలీలు, కేజీవీల్స్ కొరత ఏర్పడిందని రైతులు వాపోతున్నారు. ఎకరం వరి నారు వేయడానికి కూలీలకు గుత్తగా రూ.5 వేల నుంచి రూ.6 వేలు చెల్లిస్తున్నారు. కేజీవీల్స్ ట్రాక్టర్‌కు సైతం రూ.6వేల వరకు చెల్లించాల్సి వస్తుందని రైతులు పేర్కొంటున్నారు. కూలీల కొరత కారణంగా దూర ప్రాంతాల నుంచి వచ్చే కూలీలకు రానుపోను చార్జీలు ఇవ్వడంతో పాటు కూలి రూ.300 వరకు చెల్లిస్తున్నారు. కూలీలతో నాట్లు వేయిస్తే ఆలస్యం చేస్తుండడంతో గుత్తకు నాటు వేయిస్తున్నారు. కూలీలకు ముందుగా డబ్బులు ఇస్తేనే నాట్లు వేసేందుకు వస్తున్నారని రైతులు వాపోతున్నారు. ఈసారి అధికంగా సన్నరకాల వరినే సాగు చేస్తున్నారు. కూలీల డిమాండ్, కొరత ఏర్పడుతున్నందున ముందుగానే కూలీలకు ఎక్కువ కూలి చెల్లిస్తున్నారు. వర్షాభావ పరిస్థితులవల్ల పంటలు నష్టపోయామని, ఈసారి వర్షాలు కురుస్తాయని కోటి ఆశలతో పనులు ముమ్మరం చేసినట్లు రైతులు పేర్కొంటున్నారు.

అధికారుల సలహాలు పాటించాలి

రైతులు వరి నాట్లు వేసే ముందు, వేసిన తర్వాత వ్యవసయాధికారుల సలహాలు, సూచనలు పాటించాలి. దదును చేసిన పొలంలో నాట్లు వేసే ముందు ఎకరానికి డీఏపీ బస్తా లేదా సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ మూడు బ్యాగులు లేదా గుళికలు ఎకరానికి నాలుగు కిలోలు వేసుకుంటే పీక పురుగు నివారించవచ్చు. పీక పురుగు నారు దశ నుంచే వస్తున్నందున సలహాలు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చు. ఏమైనా సందేహాలు ఉంటే ఏఈవోలను సంప్రదించాలి.

– రాజులనాయుడు, ఇన్‌చార్జి ఏవో, దహెగాం

గుంతల రోడ్డుకు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..

సిర్పూర్(టి): సిర్పూర్(టి) -కాగజ్‌నగర్ ప్రధాన రహదారిపై మండలంలోని వేంపల్లి రైల్వేగేటు వద్ద రోడ్డు గుంతలమయంగా మారగా ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సిర్పూర్(టి) ఎస్సై దీకొండ రమేశ్ శనివారం సాయంత్రం రైల్వేగేటు వద్ద గుంతల రోడ్డుకు మరమ్మతులు చేయించారు. రోడ్డుకు మరమ్మతులు పూర్తిస్థాయిలో జరగనప్పటికీ ఆదివారం వాహనదారులు, ప్రయాణికులు బ్రిడ్జికి అడ్డుగా ఉన్న ఇనుప భారీకేడ్లను తొలగించి రాకపోకలు కొనసాగిస్తున్నారు.



వేంపల్లి రైల్వేగేటు వద్ద గుంతల రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్న ఎస్సై

సిర్పూర్(టి) ప్రత్యేకాధికారిగా సత్యనారాయణ

సిర్పూర్(టి): సిర్పూర్ (టి) జీపీ ప్రత్యేకాధికారిగా ఎంపీడీవో సత్యనారాయణ ఆదివారం సిర్పూర్(టి) మేజరు గ్రామపంచాయతీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. మండలంలోని పారిగాం గ్రామపంచాయతీ ప్రత్యేకాధికారిగా డిప్యూటీ తహసీల్దార్ జి.బాలయ్య, హుడ్కిలి గ్రామపంచాయతీ ప్రత్యేకాధికారిగా తహసీల్దార్ శ్రీనివాస్, లోనవెల్లి గ్రామపంచాయతీ ప్రత్యేకాధిరిగా ఏఈ ఆర్‌డబ్ల్యూఎస్ టి.మహేందర్‌ను కేటాయించారు. ఎంపీడీవో మాట్లాడుతూ స్వచ్ఛదనం -పచ్చదనం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం 9గంటల 30 నిమిషాలకు సిర్పూర్(టి) గ్రామపంచాయతీలో ప్రత్యేక గ్రామ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం పలు రికార్డులు పరిశీలించారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎంపీడీవో సత్యనారాయణ

శ్రమదానంతో రోడ్డుకు మరమ్మతులు

బెజ్జూర్: ఎవరో వస్తారని.. ఏదో చేస్తారని ఎదురు చూడకుండా గ్రామస్తులంతా ఒక్కటై సమస్యను పరిష్కరించుకున్నారు. కురుస్తున్న భారీ వర్షాలతో మండలంలోని తిక్కపెల్లి గ్రామం నుంచి పాపన్నపేట గ్రామానికి వెళ్లే రహదారి ప్రాణహిత నది బ్యాక్ వాటర్‌తో పూర్తిగా చిత్తడిగా మారింది. రోడ్డును బాగు చేయాలని పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. దీంతో ఆదివారం పాపన్నపేట మాజీ ఎంపీటీసీ లంగారి శ్రీను, బెజ్జూర్ సహకార సంఘం మాజీ వైస్ చైర్మన్ దందేరా ఇస్తారి ఆధ్వర్యంలో తిక్కపెల్లి గ్రామస్తులు రోడ్డుకు ట్రాక్టర్ల ద్వారా మొరం వేసి శ్రమదానం ద్వారా రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు.



రోడ్డుపై మొరం వేస్తున్న గ్రామస్తులు

భక్తిశ్రద్ధలతో బోనాల జాతర



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

కౌటాల: మండల కేంద్రంలోని గుట్టపై గల కంకలమ్మ దేవి ఆలయంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో ఆషాఢ బోనాల జాతరను భక్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆషాఢ బోనాల సందర్భంగా సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు కంకలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఆలయం ఆవరణలో మొక్కలు నాటారు. ప్రతీ ఒక్కరు భక్తి భావం కలిగి ఉండాలని, ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమంలో అందరూ మొక్కలు నాటాలన్నారు. పర్యావరణం పచ్చదనంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. బోనాల జాతర సందర్భంగా స్థానిక రామాలయం నుంచి కంకలమ్మ ఆలయం వరకు బోనాల ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా శివసత్తుల విన్యాసాలు భక్తులను ఆకట్టుకున్నాయి. అనంతరం ఆలయంలో భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. దీంతో ఆలయం వద్ద భక్తుల సందడి నెలకొంది. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సుల్వ కనకయ్య, ఆలయ అర్చకులు ప్రకాశ్, బీజేపీ మండలాధ్యక్షులు నారులే వానుపటేల్, జిల్లా కార్యదర్శి బండి రాజేందర్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ సభ్యులు ఎల్ముల మల్లయ్య, మాజీ ఎంపీటీసీ దుర్గం మోతీరాం, నాయకులు సత్తయ్య, బందురావు, భీమన్న, రవి, మధుకర్, చందు, తిరుపతి, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

హరితతోరణం



వృక్షాలతో కనువిందు చేస్తున్న సావర్‌ఖెడా అంతర్గతరోడ్డు



కెరమెరిలో రోడ్డు పక్కన మొక్కలు నాటుతున్న ఉపాధి, జీపీ సిబ్బంది



సుర్దాపూర్ సమీపంలో..



గోయగాం మెయిన్ రోడ్డును కప్పేసిన వృక్షాలు

వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లాలో రోడ్లకిరువైపులా అధికారులు, ఉపాధి, జీపీ సిబ్బంది పెద్ద ఎత్తున మొక్కలు నాటుతున్నారు. గతంలో నాటిన మొక్కలు పెరిగి ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో గడిచిన ఐదేళ్లలో 1.79 లక్షల మొక్కలు నాటగా.. సుమారు 70 వేల మొక్కలు సజీవంగా ఉన్నాయి. ఈ ఏడాది 3లక్షల మొక్కలు నాటాలని లక్ష్యం పెట్టుకోగా ప్రస్తుతం 35 వేల మొక్కలను రోడ్డుకు ఇరువైపులా నాటుతున్నారు.

– కెరమెరి

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్సై రాము

బోథ్: యువకులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని బోథ్ ఎస్సై రాము అన్నారు. ఆదివారం మండలంలోని గుట్టపక్కతండా గ్రామంలో యువకులకు మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. ఇటీవల సొనాల పరిసర ప్రాంతాల్లో గంజాయి దొరకడంతో పలు గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. యువకులు గంజాయికి బానిస కావద్దన్నారు. కొన్నిగంటల మత్తు కోసం జీవతం కోల్పోవల్సిన పరిస్థితి ఉందన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్‌లు శ్రీనివాస్, రామ్మూర్తి, నరేశ్, నాయకులు బల్వీర్, యువకులు పాల్గొన్నారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని వాసవి ఆలయంలో వాసవిక్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం స్నేహితుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. ఈసందర్భంగా గతంలో అధ్యక్షులుగా పని చేసిన గుండా ప్రమోద్, గుండా వెంకటేశ్వర్లు, వేణుగోపాల్, శ్రీనివాస్, రావుల వెంకన్న, కొలిపాక వేణు గోపాల్, రవి, రమేశ్‌లను ఘనంగా సన్మానించారు. స్నేహితుల రోజుకు ఉన్న ఆవశ్యకత స్నేహితులతో తమకు జీవితంలో జరిగిన మంచి అనుభవాలను ఒకరికొకరు పంచుకున్నారు. వాసవి క్లబ్ కార్యక్రమాలను విజయవంతంగా చేస్తున్న అధ్యక్షుడు కొలిపాక శంకర్‌ను కేస్లాపూర్ హనుమాన్ ఆలయ కమిటీ అధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షుడు శంకర్, సభ్యులు గోగుల శ్రీనివాస్, వివేక్, బాలేష్, పాపిని శంకర్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

యూనివర్సిటీ పేరు మార్చవద్దు..

పొట్టి శ్రీరాములు యూనివర్సిటీ పేరు మార్చకూడదని ఆర్యవైశ్య సంఘం ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ వాసవి క్లబ్ ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు వెంకన్న డిమాండ్ చేశారు. పొట్టి శ్రీరాములు యూనివర్సిటీకి ప్రతాప్ రెడ్డి పేరు పెడతామని అసెంబ్లీలో ప్రతిపాదించిన తీర్మానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు.



వేడుకల్లో విద్యార్థులు

ఫ్రెండ్‌షిప్ డే సంబరాలు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని వసతి గృహాల్లో విద్యార్థులు ఆదివారం ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా చేతులకు రిబ్బన్స్ కట్టుకొని వేడుకలు జరుపుకున్నారు. స్నేహితులు తోడుగా ఉంటే ఎంతో సంతోషంగా ఉంటుందని వారు ఈసందర్భంగా పేర్కొన్నారు.

ఘనంగా చౌడేశ్వరి అమ్మవారి జయంతి

బెజ్జూర్: మండల కేంద్రంలో ఆదివారం దేవాంగ సంఘం ఆధ్వర్యంలో శ్రీ చౌడేశ్వరి అమ్మవారి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. భజన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో దేవాంగ సంఘం గౌరవ అధ్యక్షుడు బెనికి శ్యాంసుందర్, అధ్యక్షుడు పాలాస శేఖర్, సభ్యులు నాగుల రవికుమార్, రాజమౌళి, బెగుడ చంద్రమౌళి, గోరంటల బాపు, చంద్రమౌళి, సాంబశివ, మండిగ మహేశ్, పాలాస కేదారి, రాపెల్లి సమ్మన్న, బెనికి దామోదర్, మహిళలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న భక్తులు